సాక్షి
పశ్చిమగోదావరి
శనివారం । 22 । మార్చి । 2025



మెడికల్ షాపులపై దాడులు

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పలు మెడికల్ షాపులపై విజిలెన్స్, ఈగల్, ఔషధ నియంత్రణ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. 8లో ▸



ముగిసిన టెన్నిస్ టోర్నీ

భీమవరం కాస్మోపాలిటన్ క్లబ్‌లో నిర్వహించిన ఆలిండియా సీనియర్ ర్యాంకింగ్ టెన్నిస్ టోర్నమెంట్ శుక్రవారం ముగిసింది. 8లో ▸

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ శనివారం (సాయంత్రం)	సహరి ఆదివారం (ఉదయం)
భీమవరం	6.20	4.45
నరసాపురం	6.21	4.43
తాడేపల్లిగూడెం	6.16	4.54

న్యూస్‌రీల్

నైపుణ్యంతో అపార అవకాశాలు



ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులతో అధికారులు

భీమడోలు: నైపుణ్యాలు గల యువతకు ఉద్యోగ అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి రవి శ్యామ్ అన్నారు. భీమడోలు వేంకటేశ్వర డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఉపాధి కల్పనా శాఖల సంయుక్త ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించారు. 10వ తరగతి ఆపై చదివిన పలువురు నిరుద్యోగులు హాజరయ్యారు. డైకిన్, ముత్తూట్ ఫైనాన్స్, అరిజియో ఫైనాన్స్ కంపెనీల్లో 25 మందికి ఉద్యోగావకాశాలు కల్పించారు. కళాశాల ప్రిన్సిపల్ బొమ్ము రవికుమార్, నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్రతినిధులు జే.రాము. ప్రవీణ్, కోఆర్డినేటర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇంగ్లిష్ పరీక్షకు 98 శాతం హాజరు



భీమవరం: జిల్లాలో శుక్రవారం జరిగిన పదో తరగతి ఇంగ్లిష్ పరీక్షకు 98 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారని డీఈఓ ఈ.నారాయణ తెలిపారు. 21,867 మంది విద్యార్థులకు 398 మంది గైర్హాజరయ్యారన్నారు. ఏపీఓఎస్‌ఎస్ తెలుగు పరీక్షకు 461 మందికి 368 మంది విద్యార్థులు హాజరయ్యారని చెప్పారు. ఫ్లయింగ్ స్క్వాడ్ 42 పరీక్షా కేంద్రాలు, జిల్లాస్థాయి పరిశీలకులు నాలుగు, డీఈఓ ఆరు, ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ 10 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేయగా ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని డీఈఓ వివరించారు.

ఏలూరు జిల్లాలో..

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లాలో శుక్రవారం జరిగిన పదో తరగతి ఇంగ్లిష్ పరీక్షకు 22356 మంది విద్యార్థులు హాజరయ్యారు. 22,735 మంది రెగ్యులర్ విద్యార్థులకు 22,288 మంది హాజరయ్యారు. ఒకసారి ఫెయిలైన వారిలో 133 మందికి 68 మంది హాజరయ్యారు. జిల్లాలోని 64 కేంద్రాలను అధికారులు తనిఖీ చేశారని, పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని డీఈఓ ఎం.వెంకట లక్ష్మమ్మ తెలిపారు.

దూరవిద్య పరీక్షలకు..

ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో దూరవిద్యా విధానంలో నిర్వహిస్తున్న టెన్త్ తెలుగు పరీక్షకు 460 మంది విద్యార్థులకు 402 మంది హాజరయ్యారు. ఉర్దూ పరీక్షకు ఆరుగురికి ఆరుగురు హాజరయ్యారు. తొమ్మిది కేంద్రాలను అధికారులు తనిఖీ చేశారు.

పంచాయతీ సెక్రటరీ అరెస్ట్

భీమవరం: భీమవరం మండలం చినఅమిరంలో నిధుల దుర్వినియోగం కేసులో పంచాయతీ సెక్రటరీగా పనిచేసిన సాగిరాజు కిషోర్‌గోపాల్ కృష్ణంరాజును శుక్రవారం అరెస్టు చేసినట్టు డీఎస్పీ ఆర్‌జే జయసూర్య తెలిపారు. చినఅమిరం పంచాయతీలో సుమారు రూ.3.63 కోట్లు నిధులు దుర్వినియోగం కాగా అధికారుల ఫిర్యాదు మేరకు కృష్ణంరాజును అరెస్ట్ చేశామన్నారు. అతడిని భీమవరం రెండో అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ముందు హాజరుపర్చగా 15 రోజుల రిమాండ్ విధించారన్నారు.

సొసైటీలో నిధుల గోల్‌మాల్‌పై విచారణ

పెనుగొండ: మండలంలోని ములపర్రు ప్రాథమిక సహకార సంఘంలో 2018లో రూ.90 లక్షలు గోల్‌మాల్ కాగా దీనిపై శుక్రవారం విచారణ చేపట్టారు. అప్పటి పాలకవర్గ సభ్యులను అప్పట్లో ప్రజలు, డిపాజిటర్లు, పాలకవర్గ సభ్యులు నిలదీయడంతో రూ.50 లక్షలు చెల్లించారు. మిగతా రూ.40 లక్షలు అప్పటినుంచి రికవరీ కాలేదు. దీంతో అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఎంఎం రెహమాన్ ములపర్రు సొసైటీలో విచారణ చేపట్టారు. విచారణలో వచ్చిన అంశాలను ఉన్నతాధికారులకు నివేదించినట్టు ఆయన చెప్పారు.

ఎండలతో జాగ్రత్త

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో ఎండ తీవ్రత నుంచి ప్రజలకు రక్షణ కల్పించేందుకు ముందస్తు చర్యలను చేపట్టాలని కలెక్టర్ సీహెచ్ నాగరాణి ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి గూగుల్ మీట్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి మండల కేంద్రంలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని, పట్టణ ప్రాంతాల్లో ఎక్కువగా ఏర్పాటుచేయాలని సూచించారు. బస్టాప్, పబ్లిక్ ప్రాంతాల్లో నీడ కల్పించేలా పందిర్లు వేయాలన్నారు. ఉపాధి హామీ పథకం పనులు జరిగే ప్రాంతాల్లో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రజలు ఎండ తీవ్రతతో వడదెబ్బ బారిన పడే ప్రమాదముందని అప్రమత్తంగా ఉండాలన్నారు. గొడుగులు, తలకు టోపీ వంటివి వాడాలన్నారు. కాటన్ దుస్తులు ధరించాలని సూచించారు. డీఆర్వో మొగిలి వెంకటేశ్వర్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పశ్చిమ తీరానికి ఆలివ్ రిడ్లే

కడలి తీరం.. కూర్మాల ఆవాసం

- సంతానోత్పత్తి కోసం సముద్ర తాబేళ్ల రాక
- గుర్తించిన అటవీ శాఖ
- గుడ్ల సంరక్షణకు హేచరీ
- చినమైనివానిలంక వద్ద ప్రత్యేక ఏర్పాట్లు
- ఇప్పటివరకూ 12,341 గుడ్ల సేకరణ



గుడ్లు పెట్టేందుకు ఇసుక తవ్వుతున్న ఆలివ్ రిడ్లే తాబేలు



సేకరించిన తాబేలు గుడ్లు

సాక్షి, భీమవరం/ నరసాపురం రూరల్: ఉభయ చర జీవుల్లో తాబేళ్లు ఒకటి. తాబేళ్లలో పలురకాలు ఉన్నా ఆలివ్ రిడ్లే రకం వెరీ స్పెషల్. తాబేళ్ల జాతుల్లో ప్రత్యేకమైనవిగా చెప్పుకునే ఆలివ్ రెడ్లీ తమ సంతానోత్పత్తికి పశ్చిమగోదావరి జిల్లాలోని తీరప్రాంతాన్ని ఆవాసంగా చేసుకుంటున్నాయి. ఇటీవల దీనిని గుర్తించిన జిల్లా అటవీ శాఖ వాటి గుడ్ల కోసం చినమైనివాలంకలో తొలిసారిగా సంరక్షణ కేంద్రం ఏర్పాటుచేసింది. ఇప్పటివరకూ 116 తాబేళ్లకు చెందిన 12,341 గుడ్లను సేకరించి వాటి నుంచి పిల్లలు బయటకు వచ్చేందుకు వీలుగా ఇక్కడ భద్రపరిచారు.

19 కిలోమీటర్ల తీరం

జిల్లాలోని నరసాపురం మండలం మర్రితిప్ప నుంచి మొగల్తూరు మండలం మోళ్లపర్రు వరకు 19 కిలోమీటర్లు మేర సముద్ర తీరం ఉంది. ఈ ఏడాది జనవరిలో పదుల సంఖ్యలో మృత ఆలివ్ రిడ్లే తాబేళ్లు పెదమైనివానిలంక, చినమైనివానిలంక గ్రామాల్లోని తీరానికి కొట్టుకురావడాన్ని స్థానికులు అధికారుల దృష్టికి తెచ్చారు. ఈ క్రమంలో చినమైనివానిలంక తీరంలోని ఓ చోట తాబేలు గుడ్లు ఉండటాన్ని గుర్తించిన అధికారులు సంతానోత్పత్తికి తాబేళ్లు ఇక్కడికి వస్తున్నాయని నిర్ధారించారు.



తాబేలు గుడ్లను సేకరిస్తున్న సిబ్బంది



చినమైనివానిలంకలో తాబేలు సంరక్షణ కేంద్రం

కుక్కలు, ఇతర జంతువులు, ఆకతాయిలు నుంచి గుడ్ల సంరక్షణకు చర్యలు చేపట్టారు. ముందుగా గుర్తించిన గుడ్లను తరలించే వీలులేక వాటి రక్షణ కోసం చుట్టూ పాదలను ఏర్పాటుచేశారు.

జిల్లాలో తొలిసారిగా..

తాబేళ్ల గుడ్ల సేకరణ, సంరక్షణ, పునరుత్పత్తి కేంద్రాన్ని తొలిసారిగా జిల్లాలోని చినమైనివానిలంక తీరం వద్ద జనవరిలో అటవీశాఖ ఏర్పాటు చేసింది. రోజూ సంరక్షణ కేంద్రం సిబ్బంది తీరం వెంబడి తిరుగుతూ తాబేలు అడుగుల ఆనవాళ్లను బట్టి గుడ్లు పెట్టిన చోటును గుర్తిస్తున్నారు. తాబేలు గుడ్లు పెట్టిన తర్వాత అవి దెబ్బతినకుండా రక్షణ కోసం పైపొరగా వాటిపై రసాయనాలు విడుదల చేస్తుంది. ఈ రక్షణ పొర దెబ్బతినకుండా జాగ్రత్తగా గుడ్లను సేకరిస్తున్నారు. సంరక్షణ కేంద్రంలో 10 అంగుళాల లోతులో గుండ్రపు గొయ్యి తీసి వాటిలో 100 నుంచి 150 వరకు గుడ్లను పెట్టి ఇసుకతో కప్పుతున్నారు. గత రెండు నెలల్లో 12,341 గుడ్లు సేకరించి హేచరీలో భద్రపరిచారు. గొయ్యిలోని గుడ్లను ఎప్పుడు సేకరించింది?, ఎన్ని భద్రపరచిందనే వివరాలను గొయ్యి వద్ద స్లిప్పులపై నమోదుచేస్తున్నారు. సహజసిద్ధంగా రెండు నెలల వ్యవధిలో గుడ్ల నుంచి తాబేలు పిల్లలు బయటకు వస్తాయని అటవీ అధికారులు తెలిపారు. సముద్ర జీవులపై స్థానికులకు అవగాహన కలిగేలా తాబేలు పిల్లలను సముద్రంలో విడిచిపెట్టే కార్యక్రమంలో విద్యార్థులు, స్థానికులు, ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేస్తామన్నారు.

తాబేళ్ల సంరక్షణకు చర్యలు



పర్యావరణ సమతుల్యతకు సముద్ర జీవులను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉంది. చినమైనివానిలంక వద్ద తాబేళ్ల గుడ్ల సంరక్షణకు ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటుచేశాం. అక్టోబర్ నుంచి ఏప్రిల్ మధ్య కాలంలో వాటి రాకకు ఆటంకం కలగకుండా స్థానికులు సహకరించాలి.

– చదలవాడ నాగరాణి, కలెక్టర్


రూ.10 లక్షలతో బడ్జెట్



జిల్లాలోని తీర ప్రాంతంలో గుడ్లు పెట్టేందుకు తాబేళ్లు రావడం గుర్తించి తొలిసారిగా సంరక్షణ కేంద్రాన్ని ఏర్పాటుచేశాం. రానున్న సీజన్‌లో లక్షకు పైగా గుడ్లను సంరక్షించే లక్ష్యంతో శాశ్వత సంరక్షణ కేంద్రం ఏర్పాటుకు రూ.10 లక్షలతో ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం.

– కిరణ్, జిల్లా అటవీశాఖ అధికారి.

20 వేల కిలోమీటర్లు వచ్చి.. గుడ్లు పెట్టి..



తీరం వద్ద గోతిలో తాబేలు పెట్టిన గుడ్లు

తాము జన్మించిన చోటే మళ్లీ గుడ్లు పెట్టే జీవి సముద్ర తాబేలు మాత్రమే. వీటిలో ఎన్ని రకాలున్నా సముద్ర పర్యావరణాన్ని కాపాడటంలో ఆలివ్ రిడ్లే తాబేళ్లు ముఖ్యమైనవి. ఇవి రెండడుగుల వరకు పొడవు, సుమారు 500 కేజీల వరకు బరువు ఉంటాయి. ఆహారాన్వేషణ, గుడ్లు పెట్టడం, సంతానోత్పత్తి కోసం దాదాపు 20 వేల కిలోమీటర్లు ప్రయాణిస్తాయి. ఈ తాబేళ్లు ఎక్కువగా జపాన్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ తదితర దేశాల్లో కనిపిస్తాయి. జీవితాంతం సముద్రంలో గడిపే ఈ జీవులకు స్థిర నివాసం ఉండదు. కేవలం గుడ్లు పెట్టేందుకు మాత్రమే భూమి మీదకు వస్తాయి. నదులు సముద్రంలో కలిసే చోటు వీటి సంతానోత్పత్తికి అనువుగా ఉంటుంది. ఏటా అక్టోబర్ నుంచి ఏప్రిల్ మధ్య కాలంలో ఒడిసా, ఆంధ్రప్రదేశ్‌లోని ఒడ్డుకు చేరుకుని ఒక్కో తాబేలు 60 నుంచి 150 గుడ్లు పెట్టి ఎవరూ గుర్తుపట్టకుండా ఇసుకతో కప్పేసి తిరిగి సముద్రంలోకి వెళ్లిపోతాయి. రాష్ట్రంలోని సూర్యలంక, పలుచోట్ల వీటి సంరక్షణకు గతంలోనే కేంద్రాలను ఏర్పాటుచేశారు. వీటి మాంసానికి ఎక్కువగా డిమాండ్ ఉండటంతో కొందరు వీటిని వేటాడి మాంసాన్ని అమ్ముతుంటారు. ఇవి అంతరించిపోకుండా సముద్ర తాబేళ్లను కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక జాబితాలో చేర్చి సంరక్షిస్తోంది.

ఫెర్రీ వేలం ఖరారు



వేలం నిర్వహిస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో 2025–26కు సంబంధించి మాధవాయిపాలెం ఫెర్రీ వేలం శుక్రవారం నిర్వహించారు. వేలం రూ.4,1818,959లకు ఖరారైంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి మించి వేలం ఆదాయం రూ.1.20 కోట్ల మేర పెరిగింది. సీల్డ్ కం బహిరంగ పద్ధతిలో నిర్వహించిన వేలంలో అంబేడ్కర్ కోనసీమ జిల్లా మల్కిపురం మండలం టేకిశెట్టిపాలెం గ్రామానికి చెందిన శ్రీ విఘ్నేశ్వర క్వారీ అండ్ బోట్స్‌మెన్ లేబర్ కాంట్రాక్ట్ కో–ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ పాట దక్కించుకుంది. నరసాపురం, సఖినేటిపల్లి ఉమ్మడి పశ్చిమగోదావరి జెడ్పీ ఏఓ భవానీ, రెవెన్యూ అధికారి హరికృష్ణ, ఎంపీపీలు మైలాబత్తుల సోనీ, వీరా మల్లికార్జునరావు, నరసాపురం, రాజోలు డీఎల్పీఓలు, ఎంపీడీఓ గాదిరాజు రామకృష్ణంరాజు, ఎంపీడీఓ పర్యవేక్షకుడు వీరభద్రరావు ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. పట్టణ ఎస్సై ముత్యాలరావు పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశారు.

నెలాఖరులోపు సీసీ రోడ్ల నిర్మాణం

కలెక్టర్ సీహెచ్ నాగరాణి



భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో మిగిలిన సీసీ రోడ్ల నిర్మాణాలను నెలాఖరులోపు పూర్తిచేస్తామని కలెక్టర్ సీహెచ్ నాగరాణి తెలిపారు. రాష్ట్ర సచివాలయం నుంచి శుక్రవారం డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పల్లె పండుగలో భాగంగా జిల్లాల్లో చేపట్టిన అభివృద్ధి పనులపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. భీమవరం కలెక్టరేట్ నుంచి కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ జిల్లాలో 55.37 కిలోమీటర్లు సిమెంట్ రోడ్ల పనులు ప్రారంభించగా 53.54 కిలోమీటర్ల మేర నిర్మాణాలు పూర్తిచేశామన్నారు. జిల్లాలో ఉపాధి హామీ పథకం పనులు, గోకుల్ షెడ్ల నిర్మాణాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ కేసీహెచ్ అప్పారావు, పంచాయతీ రాజ్ ఎస్ఈ కె.శ్రీనివాస్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సర్వేలను వేగిరపర్చాలి

గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో నిర్వహిస్తున్న పలు సర్వేలను నిర్ణీత వ్యవధిలో పూర్తి చేయాలని కలెక్టర్ నాగరాణి ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి వర్క్ ఫ్రం హోం, మిస్సింగ్ సిటిజన్స్, ఎన్పీసీఐ, ఈకేవైసీ, పిల్లల ఆధార్ నమోదు, జియో ట్యాగింగ్ అంశాలపై మండలాల వారీగా ఆమె వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.

ఏఎంసీ.. మా పరిస్థితి ఏంటీ?

రిజర్వేషన్లతో ఆశావహుల ఆశలు గల్లంతు



భీమవరంలో ఏఎంసీ కార్యాలయం

భీమవరం: నియోజకవర్గంలో శాసనసభ్యుని తర్వాత స్థానం మార్కెటింగ్ యార్డ్ (ఏఎంసీ) చైర్మన్ పదవి. జిల్లాలోని ఏఎంసీల్లో ఈ పదవి పోటీకి అనేక మంది ఆశావహులు ఉన్నారు. అయితే ప్రభుత్వం తాజాగా రిజర్వేషన్లు ప్రకటించడంతో ఆశావహుల ఆశలు గల్లంతయ్యాయి. దీంతో వీరంతా మల్లగుల్లాలు పడుతున్నారు. కొన్నిచోట్ల టీడీపీ, జనసేన మధ్య తీవ్ర పోటీ నెలకొంది. దీంతో అభ్యర్థుల ఎంపిక ఎమ్మెల్యేలకు కత్తిమీద సాములా మారింది.

- భీమవరంలో ఏఎంసీ పదవిని ఆశిస్తున్న వారిలో పొత్తూరి బాపిరాజు, ఇందుకూరి రామలింగరాజు (టీడీపీ), బండి రమేష్‌నాయుడు (జనసేన) ఉన్నారు. అయితే ఇక్కడ పదవిని జనరల్ మహిళకు కేటాయించారు.
- ఉండి నియోజకవర్గంలోని ఆకివీడు ఏఎంసీ చైర్మన్ పదవిని బొల్లా వెంకట్రావు (బీసీ), ఉండి ఏఎంసీ చైర్మన్ పదవిని జుత్తుగ నాగరాజు (జనసేన), కలిదిండి శ్రీనివాసరాజు (టీడీపీ) ఆశిస్తున్నారు. అయితే ఆకివీడు బీసీ జనరల్‌కు, ఉండి జనరల్‌కు రిజర్వు చేయడంతో నాగరాజు ఆశలు గల్లంతయ్యాయి.
- నరసాపురం ఏఎంసీ చైర్మన్ పదవిని టీడీపీ నుంచి కొప్పాడ రవీంద్ర (బీసీ), జనసేన నుంచి వలవల నాని (ఓసీ) ఆశిస్తున్నారు. ఇక్కడ ఓసీ జనరల్‌కు కేటాయించడంతో కొత్తముఖాలు తెరపైకి వచ్చే అవకాశముంది.
- పెనుగొండలో పోటీ తీవ్రంగా ఉండటంతో ఎమ్మెల్యే పితాని సత్యనారాయణకు మింగుడు పడటం లేదు. ఇప్పటివరకు ఓసీకి చెందిన టీడీపీ ఆశావహులు బడేటి బ్రహ్మాజీ, గంటా వాసు, కోయ పోతురాజు, మైగాపుల రాము, జనసేన నుంచి గుర్రాల సూరిబాబు, కొండవీటి శ్రీనివాసరావు పోటీలో ఉన్నారు. అయితే ఇక్కడ పదవిని జనరల్ మహిళకు కేటాయించారు.
- ఆచంట ఏఎంసీ చైర్మన్ పదవికి టీడీపీ నుంచి బీసీ వర్గానికి చెందిన కేతా మీరయ్య, దొంగ నాగార్జున, పెచ్చెట్టి సుబ్రహ్మణ్యం, కోళ్ల సత్యనారాయణ, గుడాల శ్రీనివాస్, జనసేన నుంచి చిట్టూరి శ్రీనివాస్ బరిలో ఉన్నారు. అయితే ఇక్కడ పదవిని బీసీ మహిళకు రిజర్వు చేశారు. ఆచంట నియోజవర్గంలో ఉన్న రెండు ఏఎంసీల్లో ఒక్కటి తప్పనిసరిగా జనసేనకు ఇవ్వాలని ఆ పార్టీ నాయకులు పట్టుబడుతున్నారు.
- తణుకులో పదవి కోసం ఓసీ వర్గాల్లో పలువురు ఆశగా ఎదురుచూస్తుండగా ఇక్కడ ఎస్సీ మహిళకు రిజర్వు చేయడం ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణకు తలనొప్పిగా మారిందని పార్టీ వర్గాలే చెబుతున్నాయి. ఇక్కడ అబ్బదాసరి లాజర్, నత్త చంద్రశేఖర్, కొండేటి శివ వారి సతీమణులలో ఒకరికి పదవి కేటాయించే అవకాశం ఉందని తెలిసింది.
- తాడేపల్లిగూడెంలో పదవికి జనసేన నుంచి పలువురు ఆశావహులు ఉండగా ఇక్కడ ఎస్సీ జనరల్‌కు రిజర్వు చేయడంతో కొత్తముఖాలు తెరపైకి రానున్నాయి.

పాలకొల్లులో..

పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లు శాసనసభ్యునిగా కాపు సామాజికవర్గానికి చెందిన వారే ఎక్కువగా పనిచేశారు. రెండో స్థానమైన ఏఎంసీ చైర్మన్‌గా క్షత్రియులు, కాపులు, ఎస్సీ సామాజికవర్గానికి చెందిన వారు చేశారు. ప్రస్తుతం పదవి బీసీ జనరల్‌కు రిజర్వు అయ్యింది. పదవిని జనసేన లేదా బీజేపీకి ఇస్తారని ఆయా పార్టీల నేతలు ఎదురుచూస్తుండగా ఇప్పటివరకూ వారితో సంప్రదింపులు జరగలేదు. టీడీపీలో పెచ్చెట్టి బాబు, కోడి విజయభాస్కరరావు, మామిడిశెట్టి పెద్దిరాజు బరిలో ఉన్నారు. వీరంతా శెట్టిబలిజ సామాజికవర్గానికి చెందిన వారు. ఇదిలా ఉండగా మంత్రి నిమ్మల రామానాయుడు ఆలోచనా ధోరణి ఏంటన్నది, ఎలా ఉందన్నది బయటపడటం లేదు.

బాలిక హత్య కేసులో నలుగురికి జీవిత ఖైదు

- లైంగికదాడి ఆపై హత్య
- శిక్ష ఖరారు చేసిన పోక్సో కోర్టు
- 2019లో గుంటుపల్లి గుహల వద్ద ఘటన



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ శివకిషోర్

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లా తడికలపూడి మండలం జీలకర్రగూడెంలో గుంటుపల్లి గుహల వద్ద బాలికపై నలుగురు అగంతకులు లైంగికదాడికి పాల్పడి ఆపై హతమార్చిన ఘటనలో నిందితులకు జీవిత ఖైదును విధిస్తూ పోక్సో కోర్టు న్యాయమూర్తి తీర్పు చెప్పారు. శుక్రవారం రాత్రి ఏలూరు పోలీసు ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్పీ కేపీ శివకిషోర్ విలేకరులకు వివరాలు వెల్లడించారు. 2019 ఫిబ్రవరి 24న ఉదయం 11 గంటలకు గుంటుపల్లి గుహల వద్దకు సరదాగా గడిపేందుకు వచ్చిన ప్రేమ జంటపై నలుగురు అగంతుకులు దాడి చేశారు. బాలికపై దాడి చేసి అత్యాచారానికి పాల్పడ్డారు. ప్రతిఘటించిన ప్రియుడిని సైతం దుంగకర్రతో కొట్టి గాయపర్చారు. దీనిపై గుహల ప్రాంతంలో ఆర్కియోలాజికల్ సర్వే సిబ్బంది వడమాల మునిరత్నం ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

దోచుకునేందుకు వెళ్లి.. హతమార్చి..

నిందితులను కృష్ణా జిల్లా మైలవరం మండలం చంద్రారం గ్రామానికి చెందిన పొట్నూరి రాజు, ద్వారకాతిరుమల మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన తుపాకుల సోమయ్య, తుపాకుల గంగయ్య, కృష్ణా జిల్లా నందివాడ మండలం అరిసిలాల గ్రామానికి చెందిన కొమరగిరి నాగరాజుగా గుర్తించారు. వీరు ఒంటరిగా ఉన్న ప్రేమ జంటను గమనించి వారిని దోచుకునేందుకు వెళ్లారు. కత్తి, దుంగకర్రతో ప్రేమ జంట వద్దకు వెళ్లిన వీరు డబ్బులు ఇవ్వాలని లేకుంటే చంపేస్తామని బెదిరించారు. ఈ క్రమంలో పొట్నూరి రాజు దుంగకర్రతో తీవ్రస్థాయిలో తలపై కొట్టడంతో ప్రియుడు అక్కడే పడిపోయాడు. అనంతరం బాలిక వద్దకు వెళ్లి ఆమె దుస్తులను చించివేసి కర్రతో తలపై బలంగా కొట్టి లైంగికదాడికి పాల్పడ్డారు. తీవ్ర గాయాలైన ప్రియుడు అపస్మారక స్థితిలోకి వెళ్లగా బాలిక అక్కడికక్కడే మృతి చెందింది. ఆరేళ్ల పాటు ఏలూరు పోక్సో కోర్టులో విచారణ కొనసాగింది.

జీవిత ఖైదు.. రూ.10 వేల జరిమానా

పోక్సో కోర్టు న్యాయమూర్తి సునంద శుక్రవారం తుది తీర్పును వెల్లడించారు. నలుగురు నిందితులకు జీవిత ఖైదుతో పాటు రూ.10 వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ఐపీసీ 397, 376 (ఎ), సెక్షన్ 4 పోక్సో, 302 ఐపీసీ, 25 (1ఎ) భారతీయ ఆయుధాల చట్టం, 27 భారతీయ ఆయుధ చట్టం మేరకు కఠిన శిక్షలు విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. మృతురాలు తల్లిదండ్రులకు రూ.3 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు. అలాగే ప్రియుడు నవీన్‌కుమార్‌కు తగిన పరిహారం అందజేయాలని డీఎల్ఎస్ఏ ఏలూరుకు లేఖ రాశారు. పోక్సో కోర్టు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోనే సీతారామ్ బాధితుల తరఫున వాదించగా అప్పటి చింతలపూడి సీఐ యూజే విల్సన్, మరో సీఐ పి.రాజేష్ కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయడంలో కీలక పాత్ర పోషించారు. ఈ కేసుపై రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ ప్రత్యేక దృష్టి సారించారు. విలేకరుల సమావేశంలో ఎస్బీ సీఐ మల్లేశ్వరరావు, డీసీఆర్‌బీ సీఐ హబీబ్‌బాషా, మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ ఎం.సుబ్బారావు, డీసీఆర్‌బీ ఎస్సై రాజారెడ్డి, తడికలపూడి ఎస్సై చెన్నారావు, ఏపీపీ డీవీ రామాంజనేయులు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంతో సత్వర పరిష్కారం



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి (ఎఫ్ఏసీ) సునీల్‌కుమార్

ఏలూరు (టూటౌన్): కేసుల సత్వర పరిష్కారానికి మధ్యవర్తిత్వం ఎంతో దోహదపడుతుందని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి (ఎఫ్ఏసీ) ఎం.సునీల్ కుమార్ అన్నారు. ఎంపిక చేసిన న్యాయవాదులకు, సోషల్ వర్కర్ల జాతీయ న్యాయ సేవాధికార సంస్థ న్యూఢిల్లీ వారి ఆధ్వర్యంలో ఐదు రోజులపాటు నిర్వహించిన శిక్షణ కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. ముఖ్య అతిథిగా హాజరైన ఎం.సునీల్‌కుమార్ మాట్లాడుతూ ఐదు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ తరగతుల్లో తెలుసుకున్న మెలకువలతో మరింత నైపుణ్యంతో కేసుల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. మధ్యవర్తిత్వం ద్వారా ఇరుపక్షాలకు ఆమోదయోగ్యమైన, చట్టపరమైన షరతులతో రాజీ చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రెండో అదనపు జిల్లా జడ్జి పి.మంగకుమారి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కోనే సీతారాం తదితరులు పాల్గొన్నారు.

33 మంది ఏఎస్సైలకు పదోన్నతి

ఏలూరు టౌన్: ఏలూరు రేంజ్ పరిధిలో 31 మంది లా అండ్ ఆర్డర్, మరో ఇద్దరు ఏఆర్ ఏఎస్సైలకు ఎస్సైలుగా పదోన్నతి కల్పిస్తూ రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ చర్యలు చేపట్టారు. అల్లూరు సీతారామరాజు జిల్లాలో ఆరుగురు, కాకినాడ జిల్లాలో నలుగురు, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 8 మంది, తూర్పుగోదావరి జిల్లాలో 8 మంది, ఏలూరు జిల్లాలో ముగ్గురు, ఎన్టీఆర్ జిల్లాలో ఇద్దరికి ఎస్సైలుగా పదోన్నతి లభించింది. మరో ఇద్దరు ఎన్టీఆర్ జిల్లాకు చెందిన ఆర్ఎస్సైలకు పదోన్నతి కల్పించారు.

మెడికల్ షాపులపై దాడులు

తణుకులో నిషేధిత మందులు స్వాధీనం

తణుకు అర్బన్ : పట్టణంలోని మెడికల్ షాపులపై శుక్రవారం విజిలెన్స్, ఈగల్, ఔషధ నియంత్రణ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా దుకాణాల్లో ఉన్న మందుల వివరాలు, నిల్వలు, ఎక్స్‌పైరీ తేదీలు తదితర అంశాలతోపాటు నిషేధిత మందుల నిల్వలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్ జిల్లా ఎస్పీ శ్రీరామ్‌బాబు ఆదేశాల మేరకు తణుకు పట్టణంలోని పలు దుకాణాల్లో తనిఖీలు చేసినట్లు విజిలెన్స్ ఎస్సై కె.సీతారాం తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు తంగిరాల వారి వీధిలోని ఇండియన్ పబ్లిక్ స్కూలు ఎదురుగా ఉన్న భవనం మూడో అంతస్తులో అనధికారికంగా నిల్వ ఉంచిన నిషేధిత మందులను గుర్తించినట్లు చెప్పారు. లైంగిక సామర్థ్యాన్ని పెంచేవి, మత్తునిచ్చేవి, గర్భస్రావం అయ్యేటటువంటి మందులను అనధికారికంగా నిల్వ ఉంచి విక్రయాలు చేస్తున్న పెంజర్ల నాగేశ్వరరావుపై డ్రగ్ అండ్ కాస్మొటిక్స్ యాక్ట్ 1940 అండర్ సెక్షన్ 18 సీ ప్రకారం కేసు నమోదు చేసి, అతని నుంచి మందులు స్వాధీనం చేసుకున్నామని వివరించారు. ఈ మందులు తూర్పుగోదావరి జిల్లా రావులపాలేనికి చెందిన బచ్చు వెంకట సుబ్బారావు అనే వ్యక్తి నుంచి కొనుగోలు చేస్తున్నట్లుగా గుర్తించామన్నారు. అలాగే తణుకు పట్టణంలోని రాష్ట్రపతి రోడ్డులో మరొక మూడు దుకాణాల్లో తనిఖీలు చేశారు. దాడుల్లో ఈగల్ సీఐ సూర్య మోహన్‌రావు, సీసీఎస్ సీఐ రాంబాబు, తణుకు డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ పి.మల్లికార్జునరావు, విజిలెన్స్ ఏఈ ఎం.అనీల్‌బాబు తదితరులు పాల్గొన్నారు.


తణుకులో నిషేధిత మందులు నిల్వ చేసిన వ్యక్తితో విజిలెన్స్ ఎస్సై సీతారాం, ఈగల్ టీం అధికారులు


ఏలూరులో సద్భావన మెడికల్స్ షాపులో పోలీసుల కాపలాతో షట్టర్ వేసి తనిఖీలు చేస్తున్న అధికారులు

తాడేపల్లిగూడెంలో..

తాడేపల్లిగూడెం : పట్టణంలోని మెడికల్ షాపులపై శుక్రవారం విజిలెన్సు అధికారులు దాడులు చేశారు. పట్టణంలోని పోర్టుగేట్ డ్రగ్ హౌస్‌లో ఈ సోదాలు జరిగాయి. దుకాణం లైసెన్సు, నిషేధిత మందులు ఏమైనా ఉన్నాయా? జీఎస్టీ ఇతర అంశాలపై డ్రగ్స్, పోలీసు అధికారుల సమక్షంలో దాడులు చేశారు. తనిఖీల నేపథ్యంలో పట్టణంలోని మెడికల్ షాపులను మూసివేశారు. విజిలెన్సు సీఐ శివరామకృష్ణ, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ అబీద్ అలీ, పట్టణ సీఐ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

అత్తిలిలో..

అత్తిలి : స్థానిక సత్యకృష్ణ మెడికల్ షాపును విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, ఔషధ నియంత్రణశాఖ సంయుక్తంగా శుక్రవారం తనిఖీ చేశారు. మెడికల్ షాపులో అనుమతి లేని మందులతో పాటు కాలం చెల్లిన మందులను విక్రయిస్తున్నట్లు తనిఖీల్లో గుర్తించామని భీమవరం డ్రగ్ ఇన్‌స్పెక్టర్ అబిద్ అలీ తెలిపారు. ట్యాబ్లెట్ షీట్లపై ఎక్స్‌పైరీ డేట్ కట్ చేసి స్టిక్కర్లు వేసి మందులు విక్రయిస్తున్నట్లు గుర్తించి, షాపును మూయించివేశారు. మెడికల్ షాపు లైసెన్సును రద్దు చేస్తామని అలీ చెప్పారు.

ఏలూరు జిల్లాలో..

ఏలూరు టౌన్ : ప్రభుత్వ ఆదేశాలతో ఏలూరు జిల్లా వ్యాప్తంగా విజిలెన్స్, డ్రగ్స్ కంట్రోల్ అధికారులతో సంయుక్తంగా ప్రత్యేకంగా నియమితులైన విచారణ అధికారులు మెడికల్ షాపులపై దాడులు చేశారు. ఏలూరు జిల్లాలో నూజివీడు, ఏలూరు, ద్వారకాతిరుమల ప్రాంతాల్లో ఒకేసారి అధికారులు తనిఖీలు చేశారు. ఏలూరు నగరంలోని ఉదయ్ జనరిక్, సద్భావన మెడికల్స్, ద్వారకాతిరుమలలోని సంజీవిని మెడికల్స్, నూజివీడు ప్రాంతంలో సాయి బాలాజీ మెడికల్స్‌లో ఆకస్మిక తనిఖీలు చేశారు. మందుల షాపుల్లో అనధికారికంగా మందుల విక్రయాలు, డాక్టర్స్ ప్రిస్క్రిప్షన్ లేకుండా మందుల విక్రయాలు, గడువు ముగిసిన మందులను సైతం ఇష్టారాజ్యంగా అమ్ముతున్నట్లు తనిఖీల్లో వెల్లడైంది. రికార్డులు సైతం సక్రమంగా లేవని అధికారులు గుర్తించారు. కొన్ని మందుల షాపుల్లో శుక్రవారం రాత్రి వరకూ తనిఖీలు జరుగుతూనే ఉన్నాయి. ఈ తనిఖీల్లో భీమడోలు సీఐ యూజే విల్సన్, ఏలూరు త్రీటౌన్ సీఐ కోటేశ్వరరావు, నూజివీడు రూరల్ సీఐ కె.రామకృష్ణ, విజిలెన్స్ విభాగం సీఐ ప్రసాద్‌కుమార్, ఎస్సై రంజిత్‌కుమార్, నాగరాజు, విజిలెన్స్ డీఈ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ముగిసిన ఆలిండియా టెన్నిస్ టోర్నమెంట్


టెన్నిస్ టోర్నమెంట్ విజేతలకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

భీమవరం: స్థానిక కాస్మోపాలిటన్ క్లబ్‌లో నిర్వహించిన ఆలిండియా సీనియర్ ర్యాంకింగ్ టెన్నిస్ టోర్నమెంట్ శుక్రవారం ముగిసింది. 35,45, 55, 65, 75 ఏళ్ల సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో నిర్వహించిన పోటీలు నిర్వహించారు. 45 ప్లస్ సింగిల్స్‌లో ఎంవీఎల్ఎన్ రాజు, 55 ప్లస్ సింగిల్స్‌లో మణిందన్, 65 ప్లస్ డబుల్స్‌లో ఆనందస్వరూప్, శ్రీనివాస్, 65 ప్లస్ సింగిల్స్‌లో వి.శ్రీనివాసరెడ్డి, 70 ప్లస్ సింగిల్స్‌లో సేతు, 70 ప్లస్ డబుల్స్‌లో సన్యాసిరాజు, గజపతి, 75 ప్లస్ డబుల్స్‌లో అశోక్‌రెడ్డి, సాయి రాంబాబు విజేతలుగా నిలిచారు. టోర్నమెంట్ విజేతలకు క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు అల్లూరి పద్మరాజు, పెన్మెత్స వెంకటరామరాజు, టోర్నమెంట్ సెక్రటరీ వీవీఎస్ సుబ్రహ్మణ్యంరాజు, ఎ.రాంబాబు బహుమతులు అందజేశారు.

ల్యాప్‌టాప్‌లు, టచ్ ఫోన్ల కోసం దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు (టూటౌన్): అర్హత కలిగిన విభిన్న ప్రతిభావంతులకు ల్యాప్‌ట్యాప్‌లు, బదిరులకు టచ్ ఫోన్ల కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ జిల్లా మేనేజరు బి.రామ్ కుమార్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. డిగ్రీ మొదటి సంవత్సరం, పాలిటెక్నిక్, ఐటీఐ చదివే వారు వీటి కోసం దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 08812-234146 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

పంచాయతీ కార్యాలయంలో రూ.91 వేలు చోరీ

ఉంగుటూరు: స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో రూ.91 వేలు చోరీకు గురైంది. ఇంటి పన్నులు, కుళాయి పన్నులు వసూలు చేసిన బీరువాలో పెట్టి తాళం వేశారు. అయితే గురువారం ఉదయం ఆఫీసు తీసేసరికి బీరువా తాళం పగలగొట్టి ఉండడంతో పంచాయతీ కార్యదర్శి పరిశీలించి చోరీ జరిగిందని నిర్ధారించారు. ఈ మేరకు ఆయన పోలీసులను ఆశ్రయించడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సూర్యభగవాన్ తెలిపారు.

బ్యాంకు ఉద్యోగుల సమ్మె వాయిదా

ఏలూరు (టూటౌన్): యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్ ఆధ్వర్యంలో ఈ నెల 24, 25 తేదీల్లో తలపెట్టిన ఉద్యోగుల సమ్మె వాయిదా పడినట్లు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా బ్యాంకు ఉద్యోగుల సమన్వయ సంఘం అధ్యక్షులు డి.శ్రీనివాస్ మోహన్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటనలో విడుదల చేశారు. ఢిల్లీలో యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్, ఇండియన్ బ్యాంక్ అసోసియేషన్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫైనాన్షియల్ సర్వీసెస్, సెంట్రల్ లేబర్ కమిషన్ మధ్యన శుక్రవారం జరిగిన చర్చలు సఫలం కావడంతో సమ్మె వాయిదా వేశారని పేర్కొన్నారు.

లారీ ఢీకొని ఉపాధ్యాయురాలి మృతి


సిర్ల సుజాత

పెనుమంట్ర: మండలంలోని నెగ్గిపూడి గ్రామ పంచాయతీ సమీపంలో శుక్రవారం మధ్యాహ్నం టిప్పర్ లారీ స్కూటర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మార్టేరులోని ఒక ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్న సిర్ల సుజాత (55) అక్కడికక్కడే మృతి చెందింది. మృతదేహం తలపై నుంచి లారీ టైరు వెళ్లడంతో నుజ్జునుజ్జు అయ్యింది. భోజన విరామ సమయంలో తన యాక్టివా మోటార్ సైకిల్‌పై పాఠశాల నుంచి నెగ్గిపూడిలోని ఇంటికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఆమె భర్త సిర్ల చిన్న సూర్యనారాయణ రెడ్డి ఫిర్యాదు మేరకు పెనుమంట్ర ఎస్సై కె.స్వామి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థిని ఆత్మహత్య

తాడేపల్లిగూడెం రూరల్: అనారోగ్య సమస్యలతో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శుక్రవారం మండలంలోని కొమ్ముగూడెం గ్రామంలో చోటు చేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొమ్ముగూడెం గ్రామానికి చెందిన బాలిక (15) అనారోగ్య సమస్యలతో బాధపడుతుంది. ఈక్రమంలో శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు బాలిక తల్లి సకినాల సుజని రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడేపల్లిగూడెం ఏరియా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రూరల్ ఎస్సై ప్రసాద్ దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

భీమవరం: స్థానిక వన్‌టౌన్‌లో ఓ గదిలో ఉంటున్న యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. గుంటూరు జిల్లా పొన్నూరు మండలం ఇటికంపాడుకు చెందిన గిరిపరమేశ్వర్ (20) భీమవరంలోని ఆర్టీసీ గ్యారేజీకి ఓ ఏడాది శిక్షణ నిమిత్తం ఫిబ్రవరి 18న వచ్చాడు. మార్చి 20న తల్లిదండ్రులు ఫోన్ చేస్తే రింగ్ అవుతున్నా లిఫ్ట్ చేయకపోవడంతో అనుమానంతో వేరొకరికి ఫోన్ చేసి చూడమని కోరగా ఆ వ్యక్తి యువకుడు ఉంటున్న గది దగ్గరకు వెళ్లి తలుపు తెరిచి చూసే సరికి గదిలోని ఫ్యానుకు ఉరివేసుకుని నేలకు తాకుతూ వేలాడుతూ కనిపించాడు. ఈ విషయాన్ని మృతుడి తల్లిదండ్రులకు చెప్పడంతో శుక్రవారం మృతుడి తండ్రి మస్తాన్ రావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఎస్సై బి.వై కిరణ్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

గ్రామీణాభివృద్ధిపై సమీక్ష

ఏలూరు(మెట్రో): గ్రామీణాభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం శుక్రవారం స్థానిక జెడ్పీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించారు. జెడ్పీ చైర్‌పర్సన్ జి.పద్మశ్రీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఉపాధి హామీ పథకం అమలు తీరు, సీసీ రోడ్ల నిర్మాణం, ఫామ్ పాండ్లు, పశు షెడ్ల నిర్మాణాలు తదితర అంశాలపై సమీక్షించారు. జెడ్పీ సీఈఓ భీమేశ్వర్, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల డ్వామా, డీఆర్డీఏ, గృహ నిర్మాణ శాఖ పీడీలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

భీమడోలు: జాతీయ రహదారి భీమడోలు కనక దుర్గమ్మ గుడి వద్ద శుక్రవారం ఓ మోటార్ బైక్‌ను వెనుక నుంచి కారు ఢీకొట్టడంతో వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పెదవేగి మండలం వేగివాడకు చెందిన గంటా భరత్(21), గోపాలపురానికి చెందిన చల్లా సుబ్రహ్మణ్యం ఇద్దరూ స్నేహితులు. వారు శుక్రవారం వ్యక్తిగత పనుల నిమిత్తం ఏలూరు నుంచి తాడేపల్లిగూడెం బైక్‌పై వెళ్లి పనులు ముగించుకుని తిరిగి స్వగ్రామానికి వచ్చేందుకు భీమడోలు వైపుగా వస్తున్నారు. కనకదుర్గ గుడి వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి అతివేగంగా వచ్చిన కారు బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయాయ్యి. వారిని భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రానికి చికిత్స నిమిత్తం తరలించారు. అక్కడ ప్రాథమిక వైద్యం చేసి ఏలూరు వైద్యశాలకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ గంటా భరత్(21) మృతి చెందాడు. తీవ్ర గాయాలైన సుబ్రహ్మణ్యాన్ని విజయవాడ తరలించారు. ఈ మేరకు భీమడోలు ఎస్సై వై.సుధాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్ బోల్తా.. వ్యక్తి మృతి



మృతుడు చక్రవర్తి, రహదారిపై ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

ముదినేపల్లి రూరల్: మండలంలోని పెనుమల్లి వద్ద శుక్రవారం ట్రాక్టర్ బోల్తా పడి వ్యక్తి మృతి చెందాడు. ఇందుకు ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమంటూ గ్రామతులు ఆందోళనకు దిగడంతో రెండు గంటల పాటు జాతీయ రహదారిపై ట్రాఫిక్ నిలిచిపోయింది. వివరాల ప్రకారం మండలంలోని సంకర్షణపురానికిచెందిన ముత్యాల చక్రవర్తి(32), మరో ఐదుగురు కూలీలతో మినుము నూర్పిడి చేసేందుకు ట్రాక్టర్‌పై కూలి పనికి వెళ్తున్నారు. పెనుమల్లి సమీపానికి వెళ్లగానే మలుపు వద్ద డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా ట్రాక్టర్ బోల్తా పడింది. ప్రమాదం నుంచి ఐదుగురు కూలీలు తప్పించుకోగా ట్రాక్టర్‌పై ఉన్న మినుము నూర్పిడి యంత్రం చక్రవర్తిపై పడి తీవ్రగాయాలపాలయ్యాడు. ప్రమాద సమయంలో స్థానికులు ఎవ్వరూ అందుబాటులో లేకపోవడంతో తీవ్ర గాయాలతో అరగంట సేపు ప్రాణాపాయస్థితిలో కొట్టుమిట్టాడాడు. సమాచారం అందుకున్న బంధువులు గుడివాడ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువెళ్లగా అప్పటికే మరణించినట్లు వైద్యులు తెలిపారు. చక్రవర్తి మృతదేహంతో గుడివాడ నుంచి బయల్దేరిన గ్రామస్తులు చక్రవర్తి కుటుంబానికి న్యాయం చేయాలని పోలీసుస్టేషన్ ఎదుట ఆందోళన చేయాలని నిర్ణయించారు. సమాచారం తెలుసుకున్న పోలీసు సిబ్బంది గుడివాడ నుంచి వస్తున్న చక్రవర్తి మృతదేహాన్ని జాతీయ రహదారిపై కోడూరు వద్ద అడ్డుకున్నారు. దీంతో గ్రామస్తులకు, పోలీసులకు తీవ్ర వాగ్వివాదం జరిగింది. మృతుడి తరపు వ్యక్తులకు ప్రమాదానికి కారణమైన డ్రైవర్ తరపు వ్యక్తులకు మధ్య రాజీ చర్చలు సఫలం కావడంతో ఆందోళన విరమించారు.

గంగానమ్మ విగ్రహ తొలగింపుతో ఉద్రిక్తత

నూజివీడు : పట్టణంలోని కృష్ణా బడ్డీ కొట్టు సెంటర్‌లో రావి చె ట్టు వద్ద ఉన్న గంగానమ్మ విగ్రహాలను శుక్రవారం ఉదయం 6.30 గంటల సమయంలో యడవల్లి రవిచంద్ర(32) అనే అతను గునపంతో తవ్వి ధ్వంసం చేసి పక్కన పడేశాడు. అంతేకాకుండా అక్కడే ఉన్న దేవుడి ఫొటోలను సైతం పక్కన పడేశాడు. ఈ సంఘటన పట్టణంలో తీవ్ర సంచలనం కలిగించింది. ఈ విషయం తెలిసి స్థానికులు పెద్ద ఎత్తున అక్కడకి చేరుకోవడంతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు వెంటనే స్పందించి యడవల్లి రవిచంద్రను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇది తమ సొంత స్థలమని, అందులో ఎవరెవరో వచ్చి విగ్రహాలు పెట్టి తాము ఏర్పాటు చేసిన గుడి అన్నట్లుగా ప్రవర్తిస్తున్నారని, అసలు తమ పట్టా భూమిని తాము స్వాధీనం చేసుకోవడానికి తవ్వినట్లు రవిచంద్ర విచారణలో తెలిపాడని సీఐ పి.సత్యశ్రీనివాస్ తెలిపారు. అయితే మున్సిపల్ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణతో పాటు పట్టణానికి చెందిన పలువురు పెద్దలు ఇప్పటివరకు ఎక్కడైతే గంగానమ్మ విగ్రహం ఉందో మళ్లీ అక్కడే విగ్రహాన్ని శాస్త్రోక్తంగా ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.


గునపంతో తవ్వి పక్కన పడేసిన గంగానమ్మ విగ్రహం

హ్యాండ్‌బాల్ రాష్ట్ర విజేత పశ్చిమగోదావరి

విజయవాడస్పోర్ట్స్: రాష్ట్ర స్థాయి అండర్–19 జూనియర్ బాలికల హ్యాండ్‌బాల్ పోటీల్లో పశ్చిమగోదావరి జిల్లా సత్తా చాటింది. ఈ నెల 20న విజయవాడలోని ఆంధ్రా లయోల కాలేజీలో ప్రారంభమైన ఈ పోటీలకు 12 ఉమ్మడి జిల్లాలు ప్రాతినిధ్యం వహించాయి. లీగ్ కం నాకౌట్ పద్ధతిలో జరిగిన ఈ పోటీల్లో పశ్చిమగోదావరి జట్టు వరుస విజయాలను సాధించింది. శుక్రవారం జరిగిన ఫైనల్స్‌లో ప్రత్యర్థి తూర్పుగోదావరి జిల్లా జట్టును ఓడించి విన్నర్ ట్రోఫీని అందుకుంది. విజేతలకు ఆంధ్రప్రదేశ్ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు మల్లేశ్వరరావు, లయోల కాలేజీ వ్యాయామ విద్యా విభాగాధిపతి డాక్టర్ కె.సుజాత ట్రోఫీలు అందజేశారు.


పశ్చిమగోదావరి జిల్లా జట్టుకు విన్నర్ ట్రోఫీని అందజేస్తున్న దృశ్యం

ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం రాష్ట్ర కమిటీ ఎన్నిక

పెదవేగి: మండలంలోని విజయరాయి సీతారామ కల్యాణ మండపంలో శుక్రవారం కోకో రైతుల రాష్ట్ర కమిటీను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా బొల్లు రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి గా కె.శ్రీనివాస్, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడిగా ఎస్.గోపాలకృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా బోళ్ల సుబ్బారావు (పశ్చిమగోదావరి), పానుగంటి అచ్యుతరామయ్య (ఏలూరు), ఉప్పుగంటి భాస్కరరావు (కోనసీమ), గుదిబండి బండి వీరారెడ్డి (ఏలూరు), మార్ని శ్రీనివాసరావు (తూర్పుగోదావరి) సహాయ కార్యదర్శులుగా ఉప్పల కాశీ (తూర్పుగోదావరి), కొసరాజు రాధాకష్ణ (ఏలూరు), కొప్పిశెట్టి ఆనంద వెంకటప్రసాద్ (కోనసీమ), కోశాధికారిగా జాస్తి కాశీ బాబు (ఏలూరు) మరో 35 మందితో రాష్ట్ర నూతన కమిటీని ఎన్నుకున్నారు. కోకో రైతుల సమస్యలను పరిష్కరించాలని 24, 25 తేదీల్లో కోకో సాగు చేస్తున్న అన్ని జిల్లాల్లో ధర్నాలు, రాస్తారోకో కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు నూతన కమిటీ సభ్యులు పేర్కొన్నారు.


కోకో రైతుల రాష్ట్ర కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కార్యదర్శి శ్రీనివాస్

● ఆడుకుంటానని.. వెళ్లిపోయావా అన్నయ్యా!



ఆడుకుంటానని వెళ్లి.. అనంతలోకాలకు వెళ్లిపోయావా.. అన్నయ్యా? అంటూ చెల్లెలు రోదించిన తీరు పలువురిని కంటతడి పెట్టించింది. మండలంలోని చినకాపవరం గ్రామంలో ఓల్డ్ వయ్యేరు పంట కాలువలోకి శుక్రవారం స్నానం చేసేందుకు వెళ్లిన ఇద్దరు విద్యార్థులు శరత్ కుమార్, పవన్ సాయి మృత్యువాత పడ్డారు. అయితే విగతజీవిగా పడి ఉన్న అన్న మృతదేహాన్ని చూసిన చెల్లెలు తోడు లేకుండా వెళ్లిపోయావా? అన్నయ్యా అంటూ రోదించింది. పదేళ్ల వయస్సులోనే ఇద్దరు బాలురు మృతి చెందడంతో చినకాపవరం, పెదకాపవరం గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.

– ఆకివీడు

మోటార్ సైకిల్‌కు నిప్ప పెట్టిన దొంగలు

కామవరపుకోట: ఒక మోటార్ సైకిల్ నిప్పంటించి కాల్చి వేసి, వేరొక మోటార్ సైకిల్ దొంగిలించిన ఘటన ఈస్ట్ యడవెల్లి గ్రామంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలోని కొణతం స్వామి ఇంటి ఆవరణలో గురువారం రాత్రి పెట్టిన హోండా షైన్ మోటార్ సైకిల్ శుక్రవారం ఉదయానికి పూర్తిగా కాలిపోయి కనిపించింది. అదే రోజు రాత్రి ముక్కు కృపారాజు ఇంటి ఆవరణలో ఉన్న హోండా షైన్ మోటార్ సైకిల్ దొంగలు దొంగలించిపోయారు. ఈ ఘటనపై బాధితులు తడికలపూడి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కాలువలో స్నానానికి దిగి విద్యార్థి గల్లంతు


వరప్రసాద్

పెంటపాడు: మండలంలోని పరిమెళ్ల చినకాపవరం కాలువలో డ్యాం వద్ద స్నానానికి దిగి ఒక విద్యార్థి గల్లంతయ్యాడు. పెంటపాడు ఎస్సై స్వామి తెలిపిన వివరాల ప్రకారం తాడేపల్లిగూడెం శశి ఇంజనీరింగ్ కళాశాలలో చదువుతున్న 8 మంది విద్యార్థులు శుక్రవారం మధ్యాహ్నం పరిమెళ్ల గ్రామ శివారు చినకాపవరం కాలువలోకి స్నానాలు చేసేందుకు వెళ్లారు. కొంతసేపు వారంతా కాలువలో ఆటలాడారు. ఉన్నట్టుండి ఒక విద్యార్థి అయిన గుంటూరు జిల్లా మండేపూడి గ్రామానికి చెందిన పల్లెపోగు వరప్రసాద్ (20) ప్రమాదవశాత్తూ కాలువ లోతు తెలియక కొట్టుకుని పోయాడు. వెంటనే సహచర విద్యార్థులు, స్థానికులు పోలీసులకు, ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. కాగా రెస్క్యూ సిబ్బంది సాయంతో పరిసర ప్రాంతమంతా రాత్రి పొద్దుపోయే వరకు వెతికినా ప్రసాద్ ఆచూకీ లభించలేదు. ఫైర్ అధికారి జీవీ సుబ్బారావు, ఎస్సై స్వామి సంఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలను పరిశీలించారు.

ఆర్టీసీ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఆరేళ్లగా పెండింగ్‌లో ఉన్న ఆర్టీసీ ఉద్యోగుల పదోన్నతులకు మార్చి నెలాఖరులోగా ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వాలని, లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్త ఉద్యమం చేపడతామని ఏపీపీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు, అమరావతి జేఏసీ సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదరరావు హెచ్చరించారు. యూనియన్ పశ్చిమగోదావరి జిల్లా రీజనల్ కౌన్సిల్ సమావేశం శుక్రవారం స్థానిక సూర్యవంశీ ఎన్‌క్లేవ్‌లో రీజినల్ అధ్యక్షుడు ఎన్వీ ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా దామోదరరావు మాట్లాడుతూ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి ఆరేళ్లు గడిచినా ప్రభుత్వ ఉద్యోగులుగా ఆర్టీసీ సిబ్బందికి ప్రమోషన్లు ఇవ్వలేదన్నారు. మూడు వేల మంది సిబ్బంది ప్రమోషన్స్ కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. పదోన్నతులతో పాటు 11వ పీఆర్సీ బకాయిలు, డీఏ బకాయిలు, సరండర్ లీవ్ సొమ్ములను చెల్లించాలని కోరారు. తొలుత పట్టణంలో ఈయూ కార్యాలయానికి శంకుస్థాపన చేశారు. ఈయూ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.డీ ప్రసాద్, ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.సోమసుందర్,సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు పాల్గొన్నారు.

విద్యార్థుల బహుముఖ ప్రతిభ అభినందనీయం


విద్యార్థులను అభినందిస్తున్న ఏపీ నిట్ ఇన్‌చార్జి డైరెక్టర్ ఎన్వీ రమణరావు తదితరులు

తాడేపల్లిగూడెం: చదువుతో పాటు, ఇతర రంగాల్లో విద్యార్థులు బహుముఖ ప్రతిభ ప్రదర్శించడం అభినందనీయమని ఏపీ నిట్ ఇన్‌చార్జి డైరెక్టర్ ఎన్వీ రమణరావు అన్నారు. శుక్రవారం నిట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నిట్‌కు చెందిన విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాల్లో ప్రతిభ కనబరుస్తున్నారని, దీంతో అనేక పురస్కారాలను అందుకుంటున్నందుకు అభినందనీయమన్నారు. సీనియర్ విద్యార్థుల స్ఫూర్తితో జూనియర్‌లు ప్రేరణ పొంది అన్ని విషయాలలో అన్ని రంగాలల్లో అగ్రగామిగా ఉండాలన్నారు. అనంతరం బ్యాంక్ ఆఫ్ బరోడా అచీవర్స్ అవార్డులను అందించారు. బీటెక్ 2021–25కు చెందిన బీటెక్ ఆఖరిసంవత్సరం చదువుతున్న విద్యార్థులు కలిదిండి పవన్‌తేజ సత్యవర్మను , తుమ్మూరి మంజునాథ్‌లను అభినందించారు. ఆలిండియా నిట్ పోటీల్లో నాలుగు పతకాలు సాధించిన ఎస్.హర్షిత్‌ను అభినందించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ దినేష్‌రెడ్డి, బ్యాంక్ ఆఫ్ బరోడా పెదతాడేపల్లి బ్రాంచ్‌మేనేజర్ ఎం.కేదారి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

110 మందికి కంటి పరీక్షలు



జగ్గన్నపేట గ్రామంలో కంటి పరీక్షలు చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని జగ్గన్నపేట పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నిడదవోలు రాజేశ్వరి రామకృష్ణన్ లయన్స్ కంటి ఆసుపత్రి నిపుణులు 110మందికి కంటి పరీక్షలు చేయగా, వారిలో 50 మందికి ఉచితంగా కళ్లజోళ్లు, మరో 10 మందికి ఆపరేషన్లు అవసరంగా గుర్తించి నిడదవోలు తరలించారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు పచ్చా వెంకటేశ్వరరావు, పాండురంగారావు, కురుమెళ్ల వెంకటాచలం, బురిడి సతీష్, మిరియాల కిషోర్‌కుమార్, చేకూరి బంగార్రాజు, కురుమెళ్ల బాలకృష్ణ, పచ్చా రామకృష్ణ, పృథ్వి, గ్రామస్తులు పాల్గొన్నారు.

గౌరీదేవికి ప్రత్యేక పూజలు



గౌరీదేవి అమ్మవారిని దర్శించుకొన్న ఎక్సైజ్ సీఐ స్వరాజ్యలక్ష్మి

పెంటపాడు: మండలంలోని గౌరీదేవి అమ్మవారి ఆలయ నూతన ప్రతిష్ఠ పురస్కరించుకొని శుక్రవారం గూడెం ఎక్సైజ్ సీఐ స్వరాజ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులైన కిలపర్తి వెంకటరావు, దాసరి అప్పన్న తదితరులు స్వాగతం పలికి అమ్మవారి సన్నిదిలో ప్రత్యేక పూజలు చేయించి అమ్మవారి పసుపు, కుంకుమ, చిత్రపటాలను అందజేశారు. ఈ సందర్భంగా సీఐ స్వరాజ్యలక్ష్మి మాట్లాడుతూ అమ్మవారి దయతో నియోజకవర్గం సుభిక్షంగా ఉండాలని కోరుకొన్నట్లు తెలిపారు. ఎక్సైజ్ ఎస్సై దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

అత్తిలి: పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్సై పి ప్రేమరాజు చెప్పారు. శుక్రవారం అత్తిలి మండలం కె సముద్రపుగట్టు గ్రామ శివారు పొలాల్లో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు తమ సిబ్బందితో దాడిచేసి, పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారివద్ద నుంచి రూ.3450లు స్వాధీనం చేసుకున్నామని ఎస్సై ప్రేమరాజు తెలిపారు.

ప్రార్థనా స్థలం వద్ద వ్యక్తిపై దాడి

తాడేపల్లిగూడెం: పట్టణంలోని ఓ ప్రార్థనా స్థలంలో ప్రార్థన ముగించుకొని మునిసిపల్ కోఆప్షన్ మాజీ సభ్యులు షేక్ బాజీపై వ్యక్తి ఒకరు దాడి చేసినట్టు బాజీ శుక్రవారం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వివరాలు తీసుకున్న పోలీసులు ఘటనపై దర్యాప్తు చేస్తున్నారు. కేసు ఇంకా నమోదుకాలేనట్టు తెలుస్తోంది.

మద్యం దుకాణాలను తనిఖీ చేసిన ఎక్సైజ్ సీఐ

తణుకు అర్బన్: మద్యంతర బాధుడు శీర్షికన సాక్షి పత్రికలో శుక్రవారం ప్రచురితమైన కథనానికి స్పందించిన తణుకు ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖ సీఐ సత్తి మణికంఠరెడ్డి మద్యం దుకాణాలను తనిఖీ చేశారు. మద్యం దుకాణాల్లో ప్రభుత్వం సూచించిన నిబంధనల ప్రకారం మద్యం విక్రయాలు చేయాలని లైసెన్స్‌దారులకు సూచించారు. బాటిల్స్‌పై ఉన్న ఎమ్మార్పీ ధరలకే మద్యాన్ని విక్రయించాలని, లూజ్ సేల్స్, గొలుసు దుకాణాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. దుకాణాల్లో అన్ని బ్రాండ్లను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. నూతన మద్యం విధానం ప్రారంభమైన రోజు నుంచి ఇప్పటివరకు 71 కేసులను నమోదు చేసి 61 మంది వ్యక్తులను అరెస్టు చేశామని 133.94 లీటర్ల మద్యం, 8.25 లీటర్ల బీరును స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ ఎస్ మణికంఠ రెడ్డి తెలిపారు.

కల్తీపై ఉక్కుపాదం

తాడేపల్లిగూడెం: ఆహార పదార్థాలలో ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే రసాయనాలు , రంగులు వాడే వారిపై ఉక్కుపాదం మోపుతామని ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాసు హెచ్చరించారు. శుక్రవారం ఆహార పదార్థాలల్లో, పండ్లలో కల్తీ, వేసవిలో నీటి ఎద్దడి నివారణ చర్యల గురించి మునిసిపల్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. కమిషనర్ ఎం.ఏసుబాబు మాట్లాడుతూ ఇంటింటి నుంచి చెత్త సేకరణ విషయంలో నూరు శాతం ఫలితాలు సాధించేదిశగా కార్యాచరణను రూపొందించామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీల నేతలు పాల్గొన్నారు.

ప్రశాంతంగా 'పది' పరీక్షలు

తాడేపల్లిగూడెం (టీటౌన్): పట్టణంలో పదో తరగతి పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 వరకు ఇంగ్లీషు పరీక్ష జరిగింది. పట్టణంలో 8 సెంటర్‌లలో జెడ్పీ ఉన్నత పాఠశాల, సుబ్బారావుపేట మునిసిపల్ ఉన్నత పాఠశాల, కడకట్ల కోడే వెంకట్రావు మునిసిపల్ ఉన్నత పాఠశాల, భాష్యం, శ్రీ చైతన్య, నారాయణ పరీక్షలు నిర్వహించారు.

ముందు జాగ్రత్తే శ్రీరామరక్ష

- గ్రామాల్లో కనిపిస్తున్న ఆటలమ్మ, గవద బిళ్లల కేసులు
- పిల్లల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు



చికెన్ పాక్స్(ఆటలమ్మ) వ్యాధి సోకిన దృశ్యం

పెంటపాడు: వేసవికాలం ప్రారంభమైతే చాలు చికెన్ పాక్స్(ఆటలమ్మ), గవద బిళ్లల సమస్య పిల్లల్లో అధికంగా కనిపిస్తుంది. మార్చి నెలలోకి అడుగు పెట్టకముందే ఎండలు మండుతున్నాయి. మరో వైపు ఇప్పటికే గ్రామాల్లో చికెన్ పాక్స్, గవద బిళ్లల సమస్య కనిపిస్తోంది. వీటి బారిన పడిన వారికి జలుబు, జ్వరం, శరీరంపై పొక్కులు, దవడలకు ఇరువైపులా బిళ్లలు, నొప్పి వంటి సమస్యలు తీవ్రంగా బాధిస్తాయి. అన్ని వయసుల వారికిఈ అంటువ్యాదులు సోకే అవకాశమున్నా ప్రధానంగా చిన్నారులకు ఎక్కువ ప్రమాదమని వైద్యులు చెబుతున్నారు. అందుకే ముందు జాగ్రత్తలతోనే అంటువ్యాధుల బారిన పడకుండా చూసుకోవచ్చని సూచిస్తున్నారు. నియోజకవర్గంలో పదేళ్లలోపు చిన్నారులకు ఈ వ్యాధి వస్తుంది. వారి విషయంలో మరింత శ్రద్ధ చూపాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. సాధారణంగా వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారిలో ఈ సమస్యలు ఎక్కువగా కనిపిస్తాయి. ఆటలమ్మ, గవద బిళ్లలు సోకిన వారు తీవ్ర అసౌకర్యానికి గురవుతారు. ఆకలి లేకపోవడం , ఆహారం సరిగా తీసుకోలేక తీవ్రంగా నీరసించిపోతారు. శరీరంపై నీటి పొక్కులు, జ్వరం వంటి లక్షణాలు కనిపించగానే ఆటలమ్మగా గుర్తించి వైద్యలను సంప్రదించాలి. వ్యాధి తీవ్రతను బట్టి వైద్యుల సూచన మేరకు యాంటీవైరల్, యాంటీ బయోటిక్ మందులు వాడాల్సి ఉంటుంది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

ఆటలమ్మ సోకినవారిని మిగతా వారికి దూరంగా ఉంచాలి. వారికి తేలికగా జీర్ణమయ్యే ఆహార పదార్థాలే ఇవ్వడం మంచిది. గవద బిళ్లలు వచ్చిన వారికి గొంతునొప్పి తీవ్రంగా ఉంటుంది. నోటిని శుభ్రంగా ఉంచుకోవాలి. తరచూ ద్రవ పదార్థాలను ఆహారంగా తీసుకోవాలి. చికెన్ పాక్స్, గవద బిళ్లలు వచ్చిన వారి విషయంలో ప్రజలు అపోహాలు, మూఢ నమ్మకాలతో వైద్య సహాయం తీసుకోకుండా నిర్లక్ష్యం చేస్తుంటారని, అది మంచిది కాదని వైద్యులు హెచ్చరిస్తున్నారు. వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉంటే మెదడు, ఊపిరితిత్తులకపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంటుందంటున్నారు. అసలు ఇలాంటి వ్యాధులు సోకకుండా ఉండేందుకు పిల్లలకు గోరు వెచ్చని నీరు, పరిసరాల్ని పరిశుభ్రంగా చూసుకోవాలని సూచిస్తున్నారు..

> **మూఢ నమ్మకాలొద్దు**
>
> 
>
> వేసవి కాలంలో వచ్చే వ్యాధులపై ప్రత్యేక శ్రద్ధ అవసరం. మూడ నమ్మకంతో వైద్యం అందించకపోతే ప్రమాదం. ఎక్కువ ద్రవ పదార్థాలు తీసుకోవడం మంచిది. వ్యాధి తగ్గే వరకూ వైద్యుల సలహాలు పాటించాలి
>
> – తోట రాజేష్, పెంటపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి

ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఎన్నికల్లో సత్తా చాటాలి

మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



ఎంపీటీసీ సభ్యులు, పార్టీనాయకులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు

అత్తిలి: ఈనెల 27న జరిగే మండల పరిషత్ అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికలో వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ అభ్యర్థులు విజయం సాధించి, సీఎంకు బహుమతిగా ఇవ్వాలని మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం అత్తిలిలో ఆయన నివాసంలో వైఎస్సార్ ఎంపీటీసీ సభ్యులు, పార్టీనాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కారుమూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ గత ఎంపీటీసీ ఎన్నికల సమయంలో మండల పార్టీ నాయకులు ఎంపీపీ, వైస్ ఎంపీపీ పదవులు రెండున్నరేళ్ల చొప్పున ఒప్పందం చేశారని, మొదటి రెండున్నరేళ్ల ఎంపీపీగా పనిచేసిన మక్కా సూర్యనారాయణ తన పదవీకాలం ముగిసిన వెంటనే, టీడీపీలో చేరారన్నారు. నాటి ఒప్పందం మేరకు అత్తిలి ఎంపీటీసీ సభ్యురాలు రంభ సుజాత ఎంపీపీగా, వైస్ ఎంపీపీలుగా గుమ్మంపాడు, కంచుమర్రు ఎంపీటీసీ సభ్యులు అద్దంకి శ్రీను, పురుషోత్తపు నాగ శ్రీనివాస్‌లను పేర్లను ఖరారు చేసారన్నారు. ఎంపీపీ పదవిని దక్కించుకోవడానికి కూటమి నాయకులు వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యులను ప్రలోభాలకు గురి చేసారని, కానీ వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ సభ్యులు, పార్టీనాయకులు వారి ప్రలోభాలగు లొంగకుండా పార్టీపట్ల అంకితభావంతో ఉండి, వైఎస్సార్ సీపీ అభ్యర్థులు గెలుపుకు కృతనిశ్చయంతో ఉన్నారన్నారు.

అబద్ధపు హామీలతో గద్దెనెక్కారు...

కూటమిపార్టీలు ఎన్నికల సమయంలో ఇచ్చిన మోసపూరిత వాగ్దానాలను ప్రజలకు ఇచ్చి, అధికారం చేపట్టిన అనంతరం హామీలను గాలికొదిలేసారని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు దుయ్యబట్టారు. సూపర్ సిక్స్ పథకాలు, తల్లికివందనం వంటి పలు పథకాలను ప్రచారం చేసి, ప్రజలకు ఆశలు కల్పించారని మోసం చేసారని విమర్శించారు. అధికారం చేపట్టి 9 నెలలు కావొస్తున్నా హామీలను విస్మరించారన్నారు. కూటమిపార్టీలకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలంటూ ఇటీవల అంసెబ్లీలో తమగళం వినిపించారన్నారు. హామీలు అమలు చేయకపోవడంతో కూటమిపార్టీల ఎమ్మెల్యేలు ప్రజలలో తిరగడానికి భయపడుతున్నారని పేర్కొన్నారు. మాజీ ఏఎంసీ చైర్మన్ బుద్ధరాతి భరణీ ప్రసాద్, మండల పార్టీ అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, ఎంపీపీ సుంకర నాగేశ్వరరావు, జడ్పీ కోఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, ఉపసర్పంచ్ మద్దాల శ్రీనివాస్, జిల్లా, అత్తిలి టౌన్ అధ్యక్షుడు పోలినాటి చంద్రరావు, మండల పార్టీనాయకులు వెలగల అమ్మిరెడ్డి, పెన్మెత్స రామరాజు, యాళ్ల సాధు సుందర్‌సింగ్, వెలగల సాయిబాబారెడ్డి, సబ్బితి రాజేష్, గారపాటి నాగరాజు, కోరుకొల్లు వెంకట్రావు, రంభ సూరిబాబు, కంకటాల సతీష్, గంటా నాగరాజు, సర్పంచ్‌లు కసిరెడ్డి బాలాజీ, వేగేశ్న ధనసత్యనారాయణరాజు, శింగంశెట్టి శ్రీనివాస్, పాలూరు సొసైటీ మాజీ అధ్యక్షులు కునాధరాజు శ్రీహరి రాజు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

ఉగాది మహోత్సవాలకు ఏర్పాట్లు



బలుసులమ్మ అమ్మవారి ఆలయం



ఆలయం వద్ద పందిరి

తాడేపల్లిగూడెం (టీటౌన్): పట్టణ ఇలవేల్పు బలుసులమ్మ అమ్మవారి దేవస్థానం ఉగాది మహోత్సవాలు సందర్భంగా ఆలయం వద్ద మహోత్సవ ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఆలయం వద్ద విశేష పూజలు నిమిత్తం భక్తులు కోసం పందిర్లు వేశారు. అమ్మవారిని దర్శించేందుకు వీలుగా ఆలయం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. విద్యుత్ దీపాలతో ప్రత్యేక అలంకరణ గావించారు. అమ్మవారి ఆలయాన్ని విశేషంగా అలంకరిస్తున్నారు. క్రోధినామ సంవత్సరం ఫాల్గుణ బహుళ నవమి 23వ తేదీ ఆదివారం నుంచి విశ్వావసు నామ సంవత్సరం శుక్ల విదియ 31వ తేదీ సోమవారం వరకు ఉగాది మహోత్సవాలు జరగనున్నట్లు ఆలయ నిర్వాహకులు వెల్లడించారు. 23వ తేదీ ఆదివారం గోపూజ, గణపతి పూజ, గరగల సంప్రోక్షణ విశేష అర్చనలు, 24వ తేదీ సోమవారం పాతూరు పుట్టింటి పొన్పు, 25వ తేదీ మంగళవారం విశేష కుంభాభిషేకం, 26వ తేదీ బుధవారం పట్టణ పుర వీధులలో అమ్మవారి ఊరేగింపు, 27వ తేదీ గురువారం చండీ హోమం, 28వ తేదీ శుక్రవారం సామూహిక కుంకుమ పూజలు, 29వ తేదీ శనివారం అమ్మవారికి విశేష పుష్పార్చన, 30వ తేదీ ఆదివారం ఉగాది సందర్భంగా అమ్మవారి దివ్య మంగళ దర్శనం, 31వ తేదీ సోమవారం అష్టమూర్తి రుద్రాభిషేకం, అదేవిధంగా ఏప్రిల్ 4వ తేదీన మహాకుంభనివేదన, 6వ తేదీన ఆలయ శిఖర పూజలతో ఉగాది మహోత్సవాలు పూర్తి అవుతాయని వెల్లడించారు. ఆలయ ఈవో, సిబ్బంది, ఆలయ కమిటీ నిర్వాహకుడు శ్రీరంగం అంజి కార్యక్రమాలను పర్యవేక్షించనున్నారు.

వీఆర్వోలకు పనిభారం తగ్గించాలి



అత్తిలి తహసీల్దార్ దశికవంశీకి వినతిపత్రం అందజేస్తున్న వీఆర్వోలు

అత్తిలి: గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర నాయకులు పిలుపు మేరకు గ్రామ సచివాలయాల్లో క్లస్టర్ విధానం కుదింపు వల్ల వీఆర్వోలకు పని భారం పెరుగుతుందని, పాత విధానం అమలు చేయాలని కోరుతూ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం శుక్రవారం తహసీల్దార్ దశికవంశీకి వినతిపత్రం అందజేశారు. డీడీఓగా తహసీల్దార్ ఉండే విధంగా ఏర్పాటు చేయాలని కోరారు. సచివాలయల్లో క్లస్టర్ విధానం వల్ల వీఆర్వోలు చాలా ఇబ్బందులకు గురి అవుతారన్నారు. ఉన్నతాధికారులు తమ సమస్యలను తెలిపి, న్యాయం చేయాలని వారు కోరారు.

ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాలలో జాతీయ సదస్సు

తణుకు అర్బన్: ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాలలో ఈనెల 24, 25 తేదీల్లో రెండురోజుల పాటు జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ యు.లక్ష్మీసుందరీబాయి తెలిపారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ హిస్టరీ, పొలిటికల్ సైన్స్, ఎకనామిక్స్, డీసీబీ బ్యాంకు తణుకు ఆధ్వర్యంలో సామాజిక ఆర్థిక కోణాలు చారిత్రక, రాజకీయ దృక్కోణాలు₹ అనే అంశంపై జాతీయ సదస్సుకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పచ్చని చెట్లపై అక్రమార్కుల వేటు





పచ్చని చెట్లను నరికివేసిన దృశ్యం

ఇరగవరం: పచ్చని చెట్లపై అక్రమార్కులు వేటు వేస్తున్నారు. పేట్రేగుతున్న పుల్లల మాఫియా, కాలువ గట్టుగా విచ్చల విడిగా రోజురోజుకూ ప్రేటుగిపోతున్నారు. ఇరగవరం మండలంలోని పంట బోదెలు, ప్రధాన కాలువ గట్లను పుల్ల అక్రమ వ్యాపార మాఫియా లక్ష్యంగా చేసుకుంటుంది. గట్లపై ఉన్న పెద్ద పెద్ద చెట్లను నరికేసి అక్రమంగా తరలించి లక్షల రూపాయిలు సొమ్ము చేసుకుంటుంది. అక్కమార్కులు ధన దాహానికి కాలువ గట్లపై చెట్లను నరికేసి పుల్ల మాఫియా దర్జాగా తరలించుకుపోతున్నా ఇరిగేషన్ అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదని పలువురు విమర్శిస్తున్నారు. మండలంలోని ఎక్కువ కాలువ గట్లుపై చెట్లును అక్రమ వ్యాపారులు నరికేసి పుల్లలు అమ్ముకుంటున్నారు. నరికిన పుల్లలు సాయంత్రం సమయంలో గుట్టుచప్పుడు కాకుండా ఇటుక బట్టీలకు తరలిస్తున్నారు. చెట్లు నరికివేయడం వల్ల కాలువ గట్టు బలహీనపడి వర్షాకాలంలో కోతకు గురవుతున్నాయని ప్రజలు అంటున్నారు. మండలంలోని అర్జునుడుపాలెం గ్రామంలో విచ్చలవిడిగా నరుకుతున్న కొబ్బరి చెట్లు, మామిడి, వేప చెట్లు నరికి వేయడంతో ప్రజలు నీడను కోల్పోతున్నారు. దీనికి కూటమి నేతలు అండగా నిలివడం శోచనీయం. రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లను సైతం తొలగిస్తున్నారు. గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోకుండా రెవెన్యూ, గ్రామ స్థాయి అధికార్లు కూటమి నేతలకు వత్తాసు పలుకుతున్నారు. అదే సమయంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఎటువంటి చెట్లు నరకపోయినా వారిపై వీఆర్వో తప్పుడు కేసులు పెడుతున్నాడు. కూటమి నేతలో ఇంతలా నరుకుతున్న చెట్లును వదిలేసి వైఎస్సార్ సీపీ వారిని లక్ష్యంగా చేసుకుని ఇబ్బందులు గురి చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు మేల్కొని కూటమి నేతలకు వత్తాసు పలకుండా నిజంగా చెట్లు నరుకుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పరిశుభ్రతతో వ్యాధులకు అడ్డుకట్ట



తణుకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న సబ్ యూనిట్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు

తణుకు అర్బన్: పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే చాలా వరకు వ్యాధులను అడ్డుకట్ట వేయెచ్చని సబ్ యూనిట్ అధికారి జి.వెంకటేశ్వరరావు తెలిపారు. తణుకు మునిసిపాలిటీ పరిధిలోని చాకలిచెరువు, ఎన్‌జీవో కాలనీ, ఇరగవరం రోడ్డు ప్రాంతాల్లో శుక్రవారం ఫ్రైడే డ్రైడే, వెక్టార్ కంట్రోల్ హైజీన్, మస్కిటో లార్వా డెన్సిటీ, కీటకజనిత వ్యాధులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఫ్రైడే డ్రైడే, వెక్టార్ కంట్రోల్ హైజీన్ యాక్టివిటీస్ అనేవి ×స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో అంతర్భాగమని, కదలికలేని నీటి నిల్వలు దోమల పుట్టుకకు అవాసాలని, ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని, చెత్తను పారిశుద్ధ్య కార్మికులకు అందజేయాలని కోరారు. డ్రెయిన్‌లలో మురుగు నీరు ఎక్కువ రోజులు నిల్వ ఉన్న సందర్భాల్లో ద్విచక్రవాహనాల నుంచి తీసిన ఇంజన్ ఆయిల్‌ను చల్లడం ద్వారా దోమ పుట్టుకను నివారించవచ్చని అన్నారు. బాల్యం నుంచి పిల్లలకు స్వచ్ఛతపై అవగాహన కల్పిస్తూ ఉండాలని కోరారు. ఇరగవరం రోడ్డు, కృష్ణుడి గుడి ప్రాంతాల్లో ఉన్న సోషల్ వెల్ఫేర్ కాలేజీ గరల్స్ హాస్టల్ ను విజిట్ చేసి, పరిసరాలను మరియు హైజినిక్ పరంగా కిచెన్ రూమ్ ఉంచాలని సూచనలు చేశారు. వార్డు హెల్త్ సెక్రటరీలు ఎం.పద్మావతి, కె.ప్రసన్నరాణి, బి.శిరీష, వై.మౌనిక, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉమామహేశ్వరంలో ముగిసిన సువార్త సభలు



చర్చి 50 వసంతాల కేక్ కట్ చేస్తున్న ప్రమీలమ్మ, దైవసేవకులు

పెంటపాడు: ఈనెల 18 నుంచి ఉమామహేశ్వరం ప్రేయర్‌పార్క్ ఆధ్వర్యంలో నిర్వహించిన యేసు క్రీస్తు సువార్త సభలు గురువారం రాత్రితో ముగిసాయి. ఈ సందర్భంగా రాజమండ్రికి చెందిన బ్రదర్ కె. నరేష్, రాయన్నపాలెంకు చెందిన ప్రసన్న కుమార్, కొవ్వూరుకు చెందిన బి. ప్రసన్నకుమార్, మన్నా చర్చికి చెందిన ఎస్. ఆదామ్‌రాజు తదితరులు మూడురోజులు దేవుని వాక్యం బోధించారు. ఈ సందర్భంగా 50 వసంతాల పండుగ పురస్కరించుకొని ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. సేవకురాలు ప్రమీలమ్మ ఈ సందర్భంగా కేక్ కట్ చేసి దేశ క్షేమం కోసం, క్రైస్తవుల ఐక్యతకోసం ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలు సంఘాల సభ్యులతో పాటు, పలు గ్రామాల నుంచి విశ్వాసులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. దైవసేవకురాలు ప్రమీల అమ్మను ఘనంగా ప్రేయర్ సంఘ సభ్యులు, ఎస్సీపేట యూత్ సంఘ సభ్యులు సన్మానించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ మద్దుకూరి నాగేశ్వరరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పార్టీ పటిష్టానికి గ్రామ కమిటీలు



దండగర్ర గ్రామంలో జరిగిన వైఎస్సార్‌సీపీ సమావేశ దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: పార్టీని మరింత పటిష్టం చేయడానికి గ్రామ కమిటీలు ఎంతగానో ఉపకరిస్తాయని వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి ముప్పిడి సంపత్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని దండగర్ర గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంపత్‌కుమార్ మాట్లాడుతూ పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు వివిధ విభాగాలకు గ్రామ కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆయా కమిటీలు గ్రామ స్థాయి ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అనంతరం గ్రామ కమిటీని నియమించారు. సోషల్‌మీడియా ఇన్‌ఛార్జి కనుపూరి ఉదయ భాస్కర్, నాయకులు సిర్రాపు శాంతకుమార్, ములగాల గంగారావు, సత్తి శివ, సత్తి దుర్గారావు, కొండలరావు, దండే గోతియ్య తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల్లో సృజనాత్మకత వెలికితీయాలి



ఇరగవరంలో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

ఇరగవరం: మండలంలోని ఇరగవరం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శుక్రవారం ప్రపంచ డౌన్ సింద్రోమ్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కడలి సత్యనారాయణ మాట్లాడుతూ క్రోమోజోములు అసమతుల్యత వల్ల ఈ దివ్యంగులు పుడతారని వీరికి ప్రత్యేక విద్య ద్వారా శిక్షణ ఇచ్చి వారిలో మంచి మార్పు తీసుకురావచ్చున్నారు. స్వతంత్రగా వారి పనులు చేసుకోవడమే కాకుండా వృత్తి విద్యా శిక్షణ ఇచ్చినట్లైతే నేర్చుకోగలుగు తారన్నారు. విద్యార్థులు, సమాజంలోని వాళ్ల వీరిని చూలకనగా అవహేళనగా చూడకుడాదని తెలిపారు. వారికి తగినంత సహయం అందించాలన్నారు. విద్యార్థులు అందరూ రాయడం, చదవడం, అర్థం చేసుకోవడం, వ్యక్త పరచడం, శారీరకంగాను మానసికంగాను దృడంగా ఉంటూ ఆరోగ్యం, పరిశుభ్రతను పాటిస్తు మైండ్‌ను అభివృద్ధి చేసుకోవాలని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉపాధ్యాయులు , పి రేణుక, కె రామకృష్ణ, ఐఈఆర్‌పిలు టి గాలేశ్వరరావు, వై జగదీష్, పాల్గొని బహుమతులు అందజేశారు.

మానసిక వికలాంగుల సేవలు పునరుద్ధరించాలి

తణుకు అర్బన్: మానసిక వికలాంగుల సేవలు పునరుద్ధరించాలని అఖిల భారత దివ్యాంగుల సమాఖ్య అధ్యక్షుడు కట్టా సతీష్ డిమాండ్ చేశారు. గతంలో నేషనల్ మెంటల్ హెల్త్ మిషన్‌లో భాగంగా డిస్ట్రిక్ట్ మెంటల్ హెల్త్ ప్రోగ్రామ్ అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో నిర్వహించేవారని ప్రతి నెలలో ఒక్కోరోజు ఒక్కొక్క సెంటర్‌లో మానసిక రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేసేవారని చెప్పారు. రోగులకు అవసరమైన కౌన్సెలింగ్‌తో పాటు స్మోకింగ్, ఆల్కాహాల్, డ్రగ్స్ బారిన పడ్డ వారికి ప్రత్యేక కౌన్సెలింగ్ విధానం అందుబాటులో ఉండేదని, ప్రస్తుతం ఏలూరు జిల్లాకు మాత్రమే ఈ సేవలు పరిమితం కావడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారని స్పష్టం చేశారు. కావున తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో ఈ సేవలు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.

జోష్‌తో టెక్ఎఫోరియా 2కె25



వాసవీలో టెక్ ఎఫోరియా చిత్రం

తాడేపల్లిగూడెం: వాసవీ ఇంజనీరింగ్ కళాశాలలో టెక్ఎఫోరియా 2కె25 పేరిట సాగుతున్న సాంకేతిక ఉత్సవం ఉల్లాసభరిత వాతావరణంలో జోష్‌తో రెండోరోజు శుక్రవారం సాగింది. టెక్ ఫెస్టు కన్వీనర్ డాక్టర్ రాంబాబు, కళాశాల పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు గ్రంధి సత్యనారాయణ, చలంచర్ల సుబ్బారావు, కోశాధికారి బాలకాశయ్య, టెక్నికల్ డైరెక్టర్ చక్కా అప్పారావు పాల్గొన్నారు.

వై.జంక్షన్ దుర్గమ్మ హుండీ ఆదాయం రూ. 5.5 లక్షలు

పెంటపాడు: మండలంలోని ప్రత్తిపాడు వై. జంక్షన్‌లో కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయం వద్ద హుండీ లెక్కించారు. ఆలయ ఈవో యాళ్ల శ్రీధర్ సమక్షంలో 3 నెలల 29 రోజులకు గాను అమ్మవారి హుండీ ఆదాయం రూ. 55,302 సమకూరినట్లు ఈవో తెలిపారు. దేవాదాయశాఖ ఉన్నతాధికారుల సమక్షంలో ఈ హుండీ లెక్కింపు జరిగిందన్నారు.

దాడికి పాల్పడిన వ్యక్తి అరెస్టు

తణుకు అర్బన్: మద్యం విక్రయదారుడిపై విచక్షణారహితంగా దాడిచేసి పరారైన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. ఈనెల 19వ తేదీ తెల్లవారుజామున తణుకు గణేష్‌చౌక్ సెంటర్‌లో అనధికారికంగా నిర్వహిస్తున్న రాత్రి పాయింట్‌లో మద్యం విక్రయిస్తున్న సిర్రా మధు అలియాస్ పండుపై ఇనుపరాడ్‌తో తీవ్రంగా దాడిచేసిన విషయం తెలిసిందే. దాడి అనంతరం ద్విచక్ర వాహనంపై పరారైన వ్యక్తిని యలమంచిలి మండలం కలగపూడి గ్రామానికి చెందిన వేగేశ్న రాజేష్‌గా పోలీసులు గుర్తించారు. శుక్రవారం తణుకులో అరెస్టుచేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు పోలీసులు తెలిపారు.

బ్యాంక్ ఉద్యోగుల సమ్మె వాయిదా

తాడేపల్లిగూడెం (టీటౌన్): దేశ వ్యాప్తంగా ఈ నెల 24, 25 తేదీలలో తలపెట్టిన బ్యాంక్ ఉద్యోగులు సమ్మె వాయిదా పడిందని ఎఫ్‌బీయూ నాయకులు టీవీ సూర్యానారాయణ, ఎస్.ఎస్.ప్రసాద్, జి.జవహర్ లాల్, బి.ఏడుకొండలు, దివ్యరజని, లింగంపల్లి గాంధీ, దశిక శ్రీనివాస్‌లు వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ డిమాండ్లుకు సానుకూలంగా స్పందన వచ్చిందని, దీర్ఘచర్చలు జరిగాయన్నారు. చాలా సమస్యలపై అంగీకారం కుదిరిందని, ఏప్రిల్ 3వ వారంలో తదుపరి చర్చలు ఉంటాయని, సమ్మె వాయిదా పడిందని తెలిపారు. ఉద్యోగుల సంఘటిత శక్తికి ఈ విజయం నిదర్శనం అన్నారు.